క్లుప్తంగా

తల్లి ప్రేమ వెలకట్టలేనిది



సన్మానం పొందిన తల్లులు, నర్సు

హుజూర్‌నగర్ : తల్లి ప్రేమ వెల కట్టలేనిదని బ్రహ్మకుమారి ఆశ్రమ ఇన్‌చార్జ్ బీకె శైలజ అన్నారు. గురువారం పట్టణంలోని బ్రహ్మకుమారి ఆశ్రమంలో మదర్స్ డే, నర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు పద్మ, రాధిక, వెంకటలక్ష్మి, స్టాఫ్ నర్స్ హైమావతిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో నిస్వార్థంగా ప్రేమించేది తల్లి, భగవంతుడు మాత్రమేనని అన్నారు. అదేవిధంగా తల్లిలా అనురాగం పంచి ప్రాణం పోసేది నర్సులు అని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పెరుగన్నం, పులిహోర పంపిణీ



పెరుగన్నం పంపిణీ చేస్తున్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నేరేడుచర్ల వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం పేదలకు మజ్జిగ, పులిహోర, పెరుగన్నం పంపిణీ చేశారు. తాళ్లూరి రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త తాళ్లూరి వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు తాళ్లూరి లక్ష్మీనారాయణ–శ్రీదేవి, మోహన్‌చందన్, మని చందన్‌లు, ప్రముఖ వ్యాపారి పోలిశెట్టి ఈశ్వరయ్య భార్య నిర్మల పుట్టినరోజు, వనితా క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి పుట్టిన రోజు సందర్భంగా పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాస్‌రావు, కొత్త లక్ష్మణ్, గెల్లి నర్సింహారావు, ఐతా కృష్ణ సుమంత్, వాసు, రాము, కవిత, వరప్రసాద్, అశోక్, శ్రీనివాస్, నటరాజ్, మధు, గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అనిల్ సాయి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వేసవి దృష్ట్యా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న హాస్పిటల్ సూపరింటెండెంట్ మీసా ప్రవీణ్

హుజూర్‌నగర్ : ప్రస్తుత వేసవిలో ప్రతిఒక్కరూ ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మీసా ప్రవీణ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏరియా హాస్పిటల్ వద్ద స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో మజ్జిగ ఎక్కువగా తీసుకోవడం వల్ల వడ దెబ్బకు గురి కాకుండా తప్పించుకోవచ్చని తెలిపారు. హాస్పిటల్‌లో పేషెంట్‌లకు, సిబ్బందికి మజ్జిగ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీఎం నర్సయ్య, ఎస్.లింగస్వామి, యశ్పాల్‌రెడ్డి, ఎ.శ్రీకాంత్, రమణ, కవిత, రమ, సత్యవాణి, శ్రీహర్షిత తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో సామగ్రి చోరీపై ఫిర్యాదు



రైతు వేదిక తలుపులు ధ్వంసం చేసిన దుండగులు

నేరేడుచర్ల : మండలంలోని జానలదిన్నెలో గల రైతు వేదికలో సామగ్రి చోరీపై గురువారం మండల వ్యవసాయ అధికారులు నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఓ అధికారి జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం జానలదిన్నె గ్రామంలోని రైతు వేదికను సందర్శించినప్పుడు టేబుల్, అల్మారా ఉందని, గుర్తు తెలియని వ్యక్తులు రైతు వేదికలో సామగ్రి అపహరించినట్లు సమాచారంతో తాను పరిశీలించగా తలుపులు ధ్వంసం చేసి ఉన్నట్లు తెలిపారు. గతంలో కూడా రైతు వేదిక తలుపులను ధ్వంసం చేసి ఫ్యాన్లు, మోటారు, ట్యూబ్ లైట్లు, చైర్లు, కరెంటు మీటరు వైర్, ఫైల్స్‌ను చోరీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రైతు వేదికలోని స్విచ్‌బోర్డులు పూర్తిగా ధ్వంసం చేశారని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వరి కొయ్యలకు నిప్పు పెట్టకుండా చూడాలి

హుజూర్‌నగర్ : రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ సామాజిక కార్యకర్త ఎస్‌కె మన్సూర్ అలీ కోరారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణం నుంచి వేపలసింగారం, మేళ్లచెరువు వెళ్లే దారిలో వరికొయ్యలకు నిప్పు పెట్టడం వలన రహదారి వెంట ఉన్న పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని ఆయన తెలిపారు. ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయి వాయు కాలుష్యం ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది కలిగినట్లు తెలిపారు.

భారంగా పశుపోషణ

- గ్రామీణ ప్రాంతాల్లో పశుగ్రాసం, పాలేర్ల కొరత
- పెరిగిన తవుడు, దాణా ధరలు
- కనుమరుగవుతున్న పాడి పరిశ్రమ
- ప్రభుత్వం ప్రోత్సహించాలని పాడి రైతుల వేడుకోలు



మునగాలలో బీడు భూములు లేక చెరువు ఒడ్డున సేద దీరుతున్న గేదెలు

మునగాల : పాడి పంటలతో కళకళలాడాల్సిన గ్రామీణ ప్రాంతాలు నేడు కళా విహీనంగా తయారయ్యాయి. పశుగ్రాసం కొరతతో పాడి ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో సన్న, చిన్నకారు రైతాంగం కుదేలవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పశుగ్రాసం కొరత నానాటికీ తీవ్రతరమవుతోంది. వ్యవసాయ కూలీల కొరత కారణంగా రైతులు వరికోత యంత్రాలను వినియోగించాల్సి రావడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతోంది. దీంతో పశుగ్రాసం (మోపు) ధర రూ.100 పలుకుతోంది. పశుగ్రాసం కొనలేక రైతులు తమ గేదెలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా క్వింటా తవుడు ధర రూ.1500కు చేరుకోవడంతో రైతులకు పశుపోషణ మరింత ప్రియమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పాలకు విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ పాడిరంగం పట్ల నానాటికీ రైతాంగం అంతగా మక్కువ చూపడం లేదు.

బీడు భూములు లేక..

గతంలో గ్రామాల్లో ప్రతిరైతు ఇంట రెండు నుంచి ఐదారు గేదెల వరకు ఉండేవి. వీటి పోషణ కోసం ప్రత్యేకంగా ఒక పాలేరును కేటాయించి రైతులు పాడిపోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. ప్రస్తుతం పాలేర్లుగా ఉండేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో గేదెల ఆలనాపాలన రైతులకు మరింత భారంగా మారింది. దీనికి తోడు గేదెల ధర ప్రస్తుతం రెట్టింపైంది. గతంలో రెండు లీటర్ల పాలు ఇచ్చే గేదె ధర రూ.40 వేలు ఉండేది. నేడు రూ.40వేల నుంచి రూ.60 వేలకు పెరగడంతో గేదెలను కొని పాల ఉత్పత్తి చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ప్రతి రైతు తమ ఇంటి అవసరాలకనుగుణంగా ఒక్క గేదెను మాత్రం పోషిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెరగడంతో బీడు భూములు, పచ్చిక బయళ్లు లేకపోవడంతో పొద్దస్తమానం గేదెలను రైతులు తమ ఇళ్లల్లోనే గడ్డి వేసి పోషించాల్సిన పరిస్థితి నెలకొన్నది. పెరిగిన గేదెల ధర, పశుగ్రాసం, పాలేర్ల కొరత లాంటి సమస్యలతో పశుపోషణ రైతులకు భారంగా పరిణమించింది. పాడి పరిశ్రమను అభివృద్ధి పరచేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడి పరిశ్రమ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి మరిన్ని సబ్సిడీలు ప్రవేశపెట్టి రైతులను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

పశువులు అమ్ముకోవాల్సి వస్తోంది



ప్రస్తుత పరిస్థితుల్లో పశుపోషణ భారంగా మారింది. పశుపోషణకు పెట్టిన పెట్టుబడి తిరిగి రావడం లేదు. వరిగడ్డి, తవుడు, దాణా ధరలు విపరీతంగా పెరగడం మూలంగా ఉన్న పశువులను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రస్తుతం గ్రామాల్లో పాలకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ గిట్టుబాటు కావడం లేదు.

– ఉప్పుల చిన నర్సిరెడ్డి, పాడి రైతు, మునగాల

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునగాల : మునగాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అనర్హులైన కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు కందిబండ సత్యనారాయణ ఆరోపించారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గురువారం బీఆర్‌ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరుల పేర్లే ఉన్నాయని, అర్హులైన నిరుపేదలకు మొండిచేయి చూపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పక్షపాత వైఖరితో లబ్ధిదారుల ఎంపిక చేపట్టిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఉన్నారని అన్నారు. మునగాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సమగ్రంగా చేయలేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, నల్లపాటి నాగేశ్వరరావు, ఎల్‌పి.రామయ్య, ఎల్.నాగబాబు, వల్లోజు వసంత్ కుమార్, లంజేపల్లి రాజేష్, సిరికొండ రాజేష్, షేక్ సైదా, నారగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు చోరీ



కేబుల్ వైరు చోరీకి గురైన మోటార్

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. గురువారం బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేపలసింగారం, మిట్టగూడెం గ్రామాల్లో బోరు, బావుల వద్ద సుమారు 100కు పైగా మోటార్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం, బుధవారం రాత్రి అపహరించినట్లు తెలిపారు. కేబుల్ వైర్ల విలువ సుమారు రూ.3 లక్షలకు పైగా ఉంటుందని వారు తెలిపారు. బాధిత రైతులంతా కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : ప్రస్తుత వేసవిలో వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత కొద్ది రోజులుగా వేడి గాలులు వీస్తున్నందున ప్రజలు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అంతరపంటగా కోకో సాగుతో ఆదాయం



కోకో పంట చూపుతున్న ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బంది, రైతు

మునగాల : ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా కోకో సాగు చేస్తూ రైతులు అదనపు ఆదాయాన్ని పొందుతున్నారని పతాంజలి ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ జె.హరీష్ తెలిపారు. మునగాల మండల కేంద్రంలో రైతు ఎంవీరెడ్డికి గల ఆయిల్‌పామ్ తోటలో నాలుగు సంవత్సరాల క్రితం అంతరపంటగా కోకో పంట సాగు చేయగా ప్రస్తుతం వచ్చిన దిగుబడిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. రైతు ఎంవీరెడ్డి ఆయిల్‌పామ్ సాగు చేసి ఎకరాకు 10 టన్నుల పంట దిగుబడితో ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల క్రితం ఇదే తోటలో కోకో పంట సాగు చేసినట్లు పేర్కొన్నారు. ఎకరం తోటలో 110 నుంచి 130 కోకో మొక్కలు నాటారని, మూడు సంవత్సరాల తర్వాత కోకో పంట దిగుబడి ప్రారంభవుతుందని తెలిపారు. అంతరపంట సాగుతో ఎకరానికి అదనంగా రూ.30 వేల ఆదాయం పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి శ్రీనివాస్, కౌలు రైతు ఉప్పుల సీతారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కల్మలచెరువులో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో ఛత్రునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ ఛత్రునాయక్ అన్నారు. గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బడిబాట ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడె సైదులు, ఉపాధ్యాయులు సైదిరెడ్డి, రవి, శ్రీను, నాగయ్య, విజయలక్ష్మి, రేణుక, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది

గరిడేపల్లి : వనపర్తి జిల్లా మోజెర్ల గ్రామంలో గల ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల గంటా గోపాల్‌రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాణించినట్లు కళాశాల సెక్రటరీ ఎం.స్నేహలత తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన విజయోత్సవ సంబరాలలో ఆమె మాట్లాడారు. క్రికెట్, వాలీబాల్, రంగోళి, ఫోక్ డ్యాన్స్, క్విజ్, స్కిట్, డిబేట్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, రన్నింగ్ 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి, ఖోఖో క్యారమ్, టెన్నికాయిట్, చెస్, దేశ భక్తి గీతం, పోస్టర్ ప్రదర్శనలో రెండో బహుమతి సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ హార్టికల్చర్ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జె.చీన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు కేవీకే, కళాశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల ఇన్‌చార్జ్ కేవీకే శాస్త్రవేత్త సీహెచ్.నరేష్, శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, ఎ.కిరణ్, టి.మాధురి, సుగంధి, ఉపేందర్, సౌమ్య, హర్షిణి, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

చిలుకూరు: అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిలుకూరు మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పలువురు కొంతకాలంగా కోదాడలో నివాసముంటూ.. గురువారం చిత్తు కాగితాలు ఏరుకునేందుకు ఆటోలో కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్తుండగా.. చిలుకూరు మండల కేంద్రంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రియాంక, నాగరాజు, వెంకటరమణ, పూజిత, జంపన్న, శివ, సత్యం, సుధకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో రోడ్డు పక్కకు దూసుకెళ్లి గేదెను ఢీకొట్టడంతో దానికి గాయాలయ్యాయి. బాధిత రైతు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

తాటి ముంజలకు గిరాకీ.. గీతన్నకు ఉపాధి

- తాటి ముంజలతో వేసవి తాపం నుంచి ఉపశమనం
- పోషకాలు అధికంగా ఉంటాయని ఇష్టంగా కొని తింటున్న ప్రజలు
- పట్టణాలు, రోడ్ల వెంట విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న గీతకార్మికులు



హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్‌లో తాటి ముంజలు తీస్తున్న గీతకార్మికుడు



నడిగూడెం : బృందావనపురం వద్ద తాటి ముంజలు తీస్తున్న గీత కార్మికుడు



నడిగూడెం : బృందావనపురం వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజలు

నడిగూడెం, హుజూర్‌నగర్‌రూరల్ : ప్రస్తుత వేసవిలో తాటి ముంజలకు భలే గిరాకీ ఏర్పడింది. ఎండ నుంచి ఉపశమనం, చలువ చేస్తుందని ప్రజలు తాటి ముంజలను కొనుగోలు చేసి తింటున్నారు. తాటి ముంజల్లో పోషకాలు అధికంగా ఉంటాయని వైద్యులు సైతం సూచిస్తుండడంతో ఇష్టపడుతున్నారు. దీంతో ప్రస్తుత వేసవి సీజన్‌లో ముంజలు విక్రయించి గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నడిగూడెం మండలంలోని బృందావనపురం గ్రామానికి చెందిన దాదాపు 250కు పైగా గీత కార్మికులు తాటి ఉత్పత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పలువురు తాటి ముంజలను రోడ్ల వెంట విక్రయిస్తుండగా, 80 కుటుంబాలు ఖమ్మం పట్టణంలో తాటి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆటోల్లో రవాణా చేస్తూ విక్రయించే గీత కార్మికులు రోజుకు రవాణా ఖర్చులు పోనూ ఆరు వేల రూపాయల ఆదాయం పొందుతున్నట్లు, నేరుగా ముంజలను విక్రయించే వారు రోజుకు రూ.2 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు చెబుతున్నారు. అదే విధంగా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ, కరక్కాయలగూడెం గ్రామాల్లో దాదాపు 150కు పైగా గీత కార్మికులు తాటి ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వీరితో పాటు గరిడేపల్లి మండలం వెలిదండ, రంగాపురం గ్రామాలకు చెందిన గీత కార్మికులు ప్రస్తుతం హుజూర్‌నగర్ మండల కేంద్రంలో ప్రస్తుతం తాటి ముంజలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆటోల్లో రవాణా చేస్తూ అమ్మే వారు రోజుకు రవాణా ఖర్చులు పోనూ రూ.8 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. నేరుగా ముంజలను విక్రయించే గీత కార్మికులు రోజుకు రూ. 2500 వరకు ఆదాయం పొందుతున్నట్లు చెబుతున్నారు.

ఖమ్మంలో విక్రయిస్తున్నాం



మా గ్రామంలోని తాటి చెట్ల నుంచి తీసిన తాటి ముంజలను ఖమ్మంలో విక్రయిస్తున్నాను. రోజుకు రవాణా ఖర్చులు పోను రెండు వేల రూపాయల ఆదాయం వస్తోంది. ప్రస్తుత వేసవిలో తాటి ముంజలకు బాగా డిమాండ్ ఉన్నది.

– గుండు నాగేశ్వరరావు, బృందావనపురం

కల్లుగీత వృత్తే జీవనాధారం



మా గ్రామంలో వందల సంఖ్యలో తాటిచెట్లు ఉన్నాయి. వంశ పారపర్యంగా కల్లు గీత వృత్తిపైనే జీవనం కొనసాగిస్తున్నా. ప్రస్తుత వేసవి కాలంలో తాటి ముంజలను హుజూర్‌నగర్ మండల కేంద్రంతో పాటు పట్టణ శివారులో విక్రయిస్తున్నాను. రవాణా ఖర్చులు పోనూ రూ. 8 వేల ఆదాయం పొందుతున్నాం.

– వెంకన్న, గీత కార్మికుడు, బూరుగడ్డ

ముంజలకు డిమాండ్ ఉంది



నా భర్త సహకారంతో మా గ్రామంలోని తాటిచెట్ల నుంచి ముంజలను తీసి హుజూర్‌నగర్ పట్టణానికి వెళ్లి విక్రయిస్తున్నాను. రోజుకు రవాణా ఖర్చులు పోను రూ.2500 వరకు ఆదాయం వస్తోంది. ప్రస్తుత వేసవిలో తాటి ముంజలకు బాగా డిమాండ్ ఉంది.

– మామిడి పద్మ, రంగాపురం

రోజుకు రూ.2 వేల ఆదాయం



మా గ్రామంలో వేల సంఖ్యలో తాటి చెట్లు ఉన్నా యి. నేను వంశపారపర్యంగా వచ్చిన కల్లు గీత వృత్తిపైనే జీవనం కొనసాగిస్తున్నా. ప్రస్తుతం తాటి ముంజలను ఖమ్మంలో విక్రయిస్తున్నాను. రోజుకు రవాణా, కూలీల ఖర్చులు పోను రూ.2 వేల ఆదాయం వస్తోంది. – బెల్లంకొండ లింగస్వామి, గీత కార్మికుడు, బృందావనపురం

పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం

- కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి
- రామచంద్రాపురంలో కార్డన్ సెర్చ్
- 46 బైక్‌లు, ఆటో, కారు సీజ్



రామచంద్రాపురంతండాలో కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు

మఠంపల్లి : ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. పోలీస్ భరోసా కార్యక్రమంలో భాగంగా మఠంపల్లి మండలంలోని రామచంద్రాపురంలో గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఇద్దరు సీఐలు, ఎస్‌ఐలు, మరో వంద పోలీసులతో డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 46 బైక్‌లు, ఆటో, కారును సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంచి నడవడిక కలిగిన వ్యక్తులకు పోలీసులు స్నేహితులుగా ఉంటారని, కానీ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు వాహనాల పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని, కేసులు నమోదైతే ఎన్నికలప్పుడు నిఘాతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘిక శక్తుల సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళలు, యువతులు, బాలికల పట్ల ప్రతిఒక్కరూ గౌరవ భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్, కోదాడ సీఐలు గజ్జె చరమందరాజు, రజితారెడ్డి, మఠంపల్లి ఎస్‌ఐ పి.బాబు, ఎస్‌ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయ హుండీ లెక్కింపు



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు



ఆలయ రక్షణ గోడను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు, ధర్మకర్తలు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ హుండీలను గురువారం ఆలయ పాలక వర్గం, అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. మార్చి 27 నుంచి మే 14 వరకు ప్రధాన హుండీల ద్వారా రూ.8, 96, 208ల, అన్నదానం హుండీ రూ.49,350, కల్యాణ కట్నాల ద్వారా రూ.3,73,320 మొత్తం రూ.13 లక్షల 18 వేల 778 ఆదాయం సమకూరినట్లు ఆలయ ధర్మకర్తలు చన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. హుండీల లెక్కింపునకు సాయి బృందం సభ్యులు సహకరించినట్లు తెలిపారు.

మట్టపల్లి ఆలయ రక్షణ గోడ పరిశీలన..

పులిచింతల బ్యాక్ వాటర్ కృష్ణానదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ముంపునకు గురికాకుండా ఆలయం చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. అయితే భారీ వరద వచ్చినప్పుడు బ్యాక్ వాటర్ గోడ నుంచి లీకేజై ఆలయంలోకి వస్తోంది. దీంతో విద్యుత్ మోటార్లతో వరదనీరు ఎత్తిపోయాల్సి వస్తోంది. దీంతో స్థానిక ధర్మకర్తల, అధికారులు, భక్తుల విజ్ఞప్తి మేరకు మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇటీవల ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. గురువారం మంత్రి ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ ఈఈ డి.రామ్‌కిషోర్, ఏఈ కె.జీవన్‌లు ఆలయ ధర్మకర్తలు, ఈవోలతో కలిసి రక్షణ గోడను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ రక్షణగోడ లీకేజీని, సీపేజీని పరిశీలించామని, మరమ్మతులకు అంచనా రూపొందించుటకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుకల్యాణోత్సవాలు విజయవంతం

మట్టపల్లి క్షేత్రంలో ఈనెల 10 నుంచి నిర్వహించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఆలయ ధర్మకర్తలు, ఈఓ తెలిపారు. ఇందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు, మఠంపల్లి మండల పాత్రికేయులకు, ప్రజాప్రతినిధులకు ప్రతి ఒక్కరికీ వారు ధన్యవాదములు తెలిపారు.


వడ దెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్

హుజూర్‌నగర్ : వడ దెబ్బ తగలకుండా కూలీలు జాగ్రత్త పడాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో రైస్ మిల్ కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఎండలో పనిచేసేటప్పుడు సరియైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం వల్ల అధిక వేడిని శరీరం తట్టుకోలేక వడదెబ్బ బారిన పడతారని లిపారు. వడదెబ్బ నివారణకు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైనపుడు శరీరాన్ని వేగంగా చల్లబరిచే ప్రయత్నం చేయాలన్నారు. వడ దెబ్బ తగిలితే చల్లటి గాలి తగిలేలా చూడాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌ను లీటర్ నీళ్లలో కలిపి తాగించాలని తెలిపారు. వేసవికాలంలో వదులైన నూలు దుస్తులు ధరించాలన్నారు. అధిక శరీర ఉష్ణోగ్రత, తలనొప్పి, వికారం, వాంతులను వడ దెబ్బ లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యుడిని సంప్రదించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్స్ ఇందిరాల రామకృష్ణ, లలిత, ఆశా కార్యకర్తలు సుశీల, జ్యోతి, హేమలత, కూలీలు పాల్గొన్నారు.

ఆగని దంతెల వాగు ఆక్రమణ



వాగు స్థలాన్ని చదును చేసిన రైతు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామ రెవెన్యూ పరిధిలో గల దంతెల వాగు ఆక్రమణ ఆగడం లేదు. గత సోమవారం సాక్షి దినపత్రికలో 'దంతెల వాగు ఆక్రమణ'అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఆక్రమణకు గురైన దంతెల వాగును పరిశీలించారు. వాగును ఆక్రమించిన రైతును పిలిపించి వాగులో చదును చేసిన మట్టిని తొలగించాలని ఆదేశించి, ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ సదరు వ్యక్తిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గురువారం మరో రైతు యథేచ్ఛగా వాగులో జేసీబీ సాయంతో చదును చేసి ఆక్రమణకు పాల్పడుతుండగా స్థానికులు కోదాడ ఆర్డీఓకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వాగును కబ్జా చేస్తున్న రైతును అడ్డుకున్నారు. కానీ కబ్జా చేస్తున్న రైతుపై కాని, జేసీబీ డ్రైవర్‌పై కాని ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోతే వాగు కబ్జాల పర్వానికి అడ్డు ఉండదని పలువురు గ్రామస్తులు అంటున్నారు.